క్లుప్తంగా

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

సింహాద్రిపురం : మండల పరిధిలోని సుంకేసుల సచివాలయ పరిధిలో మంగళవారం రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సురేంద్రనాథ్ తెలిపారు. ఈ శిబిరంలో ప్రత్యేక డాక్టర్లు పాల్గొంటారని.. ఆయా సచివాలయ పరిధిలోని ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

4 నుంచి పింఛన్ల పండుగ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనవరి నెల నుంచి వృద్ధాప్య పింఛన్ రూ.3వేలకు పెంచారని.. ఈ పింఛన్ ప్రజలకు అందించేందుకు ఈనెల 4న సింహాద్రిపురంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశామని ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. వారం రోజులపాటు పింఛన్ల పంపిణీ పండుగ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

నేడు పెద్దకుడాలలో...

లింగాల : మండల పరిధిలోని పెద్దకుడాల గ్రామంలోని జెడ్పీ హైస్కూలు ఆవరణలో మగళవారం ఉదయం జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ సురేంద్రనాథ్ తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ తులశమ్మ

కమలాపురం: కమలాపురంలోని బాలయోగి గురుకుల పాఠశాల విద్యార్థిని జాతీయ స్థాయి కర్లింగ్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ తులశమ్మ తెలిపారు. 9వ తరగతికి చెందిన బి.దీక్షిత, సి.చందన ప్రియ, ఎస్.పూజితలు ఇటీవల నెల్లూరులో జరిగిన అండర్-17 విభాగం కర్లింగ్ క్రీడా పోటీల్లో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆమె తెలిపారు. ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు జమ్ము-కాశ్మీర్‌లోని గుల్‌మార్గ్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపల్ వివరించారు. సోమవారం ముగ్గురు విద్యార్థినులను ప్రిన్సిపల్ అభినందించారు. వైస్ ప్రిన్సిపల్ లక్ష్మీ నరసమ్మ, పీఈటీ చంద్ర కళావతి, సావిత్రి పాల్గొన్నారు.

బడ్జెట్‌లో ఐదు శాతం కేటాయించాలి

కమలాపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టే వార్షిక బడ్జెట్‌లో అంగన్వాడీలకు 5శాతం కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న అంగన్వాడీలకు ఆయన మద్దతు తెలిపారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామ్మోహన్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ బదిలీ

ఎర్రగుంట్ల : యర్రగుంట్ల ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ వేంపల్లి అర్బన్ పోలీస్‌స్టేషన్‌కు ఎస్ఐగా బదిలీ అయ్యారు. యర్రగుంట్లలో పనిచేసిన కాలంలో ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరింప చేసి వారి మన్నలు పొందారు. బదిలీ అయిన సందర్భంగా పోలీస్ సిబ్బంది సన్మానం నిర్వహించారు.

నూతన నియామకం



డాక్టర్ బి. గంగయ్యకు నియామకపత్రాన్ని అందజేస్తున్న వీసీ, రిజిస్ట్రార్

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా ఎంబీఏశాఖ సహ ఆచార్యులు డా. బి. గంగయ్య నియమితులయ్యారు. వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్యలు నియామకపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో దూరవిద్య ఉప సంచాలకులు డా. శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఎడ్యుకేషన్‌గా ఆచార్య రమాదేవి

వైవీయూ తెలుగుశాఖ ఆచార్యులు డాక్టర్ పాలెం రమాదేవిని డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఎడ్యుకేషన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. సోమవారం వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్యలు ఈమెకు నియామకపత్రాన్ని అందజేశారు. డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి, ఆచార్య ఎస్. ఈశ్వరరెడ్డి, గంగయ్య, పార్వతి పాల్గొన్నారు.

ఆలయాలలో ప్రత్యేక పూజలు

కడప కల్చరల్ : తిరుమలేశుని తొలి గడప దేవునికడపలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని దైవ దర్శనం కోసం వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం సందడిగా కనిపించింది. సోమ వారం తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి భక్తులను దర్శనాలకు అనుమతించారు. ఉదయం 10.30 గంటల వరకు దర్శనం కోసం వచ్చిన భక్తుల సంఖ్య చాలా తక్కువగా కనిపించినా ఆ తర్వాత క్రమంగా భక్తుల సంఖ్య పెరిగింది. మధ్యాహ్నం 2 వరకు రద్దీగానే కనిపించింది. దర్శనాలు రాత్రి 8 గంటల వరకు కొనసాగాయి. జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో భక్తుల రద్దీ కనబడింది.



పులివెందుల శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షిస్తున్న జనం





పులివెందుల టౌన్: పులివెందుల పట్టణంలోని శిల్పారామం ప్రజలతో కిటకిటలాడింది. సోమవారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పులివెందుల మహేష్ ఎస్‌కే డ్యాన్స్ ఫిల్మ్ స్టూడియో మాస్టర్ శర్వన్, కదిరికి చెందిన మనూస్ డ్యాన్స్ అకాడమి మాస్టర్ మనోహర్ ఆధ్వర్యంలో చిన్నారులు చేసిన జానపద, సినీ పాటల నృత్య ప్రదర్శనలతో హోరెత్తిపోయింది. ఉదయం నుంచే శిల్పారామ ప్రజలతో నిండిపోయింది. జనాలు వన భోజనాలు ఏర్పాటు చేసుకుని మరీ కార్యక్రమాలు వీక్షించారు. ఈ కార్యక్రమంలో శిల్పారామ ఏఓ సుధాకర్, శిల్పారామ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త వత్సరం.. ఊరూరా సంబురం

కొత్త సంవత్సరాన్ని ప్రజలు ఘనంగా స్వాగతించారు. కొత్త ఏడాదిలో అందరికీ విజయాలు దక్కాలని.. సుఖ సంతోషాలు అందాలని కోటి ఆశలతో ప్రార్థనలు చేశారు. పలువురు నేతలు కార్యకర్తలతో కలిసి కేకులు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో సంబరాలు జరిగాయి. ప్రజాప్రతినిధుల ఇళ్లు సందడిగా మారాయి. పలుచోట్ల వివిధ పోటీలు నిర్వహించారు.

పులివెందుల : వైఎస్సార్‌సీపీ నేతలు వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ మధురెడ్డి ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వారి వారి స్వగృహాలలో వైఎస్సార్‌సీపీకి చెందిన నాయకులు, అభిమానులు కలిసి కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గంలోని నాయకులు పాల్గొన్నారు.

వేముల : స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, ఎంపీపీ చల్లా గంగాదేవి, జెడ్పీటీసీ కె.వెంకట బయపురెడ్డి కేక్ కట్ చేసి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వేల్పులలో గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ లింగాల ఉషారాణి, మండల పరిశీలకులు లింగాల రామలింగారెడ్డి గ్రంథాలయ సిబ్బంది ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేశారు. ఎంపీడీఓ విజయరాఘవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకట నారాయణ, మండల ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, కో-ఆప్షన్ సభ్యుల మండి మా పీరా పాల్గొన్నారు.

వైఎస్సార్‌కు నివాళి

వీరపునాయునిపల్లి: మండల కేంద్రంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల కన్వీనర్ రఘునాథరెడ్డి కేక్ కట్ చేశారు. అనంతరం మూడు రోడ్ల కూడలిలోని వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లింగాల : లింగాల మండలంలోని సోమవారం ఉదయం మండల ఎంపీపీ రమాదేవి స్వగృహంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ రమాదేవి, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు అలవలపాటి మల్లికార్జునరెడ్డి కేక్ కట్ చేసి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీడీఓ సురేంద్రనాథ్, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

కమలాపురం: నూతన సంవత్సరం పురస్కరించుకుని సోమవారం ఉదయం మహిళలు ఆలయాలకు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పులివెందుల: వైఎస్ మనోహర్‌రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



జమ్మలమడుగు పార్టీ కార్యాలయంలో నూతన సంవత్సర కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

అలాగే స్థానిక పెద్ద దర్గాలో పీఠాధిపతి హజరత్ సజ్జాద్-ఏ-నషీన్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి ఆధ్వర్యంలో దివంగత పీఠాధిపతి జహీరుద్దీన్ షా ఖాద్రి జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కేక్ కట్ చేసి భక్తులకు పంచి పెట్టారు. స్వామి వారి మజార్లపై పూలచాదర్లు సమర్పించారు. నూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. అలాగే సీఎస్ఐ, ఆర్‌సీఎం, నిస్సీ, టీసీసీ, టీసీసీ టౌన్ చర్చ్, రెహబోతు, మన్నా, హోసన్నా, షిలోహు, యెరూషలేము చర్చిలలో ఆయా పాస్టర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సాయంత్రం చర్చిల ప్రాంగణంలో తాడాట, గోనెసంచులతో పరుగెత్తడం, మ్యూజికల్ చైర్స్, లెమన్-స్పూన్, స్లో సైకిల్, స్కూటర్ రేస్ తదితర పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు.

ప్రజా ప్రతినిధుల కార్యాలయం వద్ద..

ఎర్రగుంట్ల: మండలంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు శాఖల్లో, ప్రజాప్రతినిధుల ఇళ్లల్లో సంబరాలు సోమవారం ఘనంగా జరిగాయి. మున్సిపల్ చైర్మన్ ఎం హర్షవర్ధన్‌రెడ్డి ఇంటి వద్దకు మున్సిపల్ అధికారులు సిబ్బంది చేరుకుని నూతన సంవత్సర వేడుకలు చేసుకున్నారు. జెడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్యతో పాటు ఇతరులు పాల్గొన్నారు.

మండల వ్యాప్తంగా..

వేంపల్లె : వేంపల్లె మండలంలో నూతన సంవత్సరం వేడుకలు ఘనంగా జరిగాయి. జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్ర ఓబుళరెడ్డి, సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు, ఎంపీపీ లక్ష్మీగాయత్రి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

పుష్పగిరిలో ప్రత్యేక పూజలు

వల్లూరు: మండలంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. మండలంలోని ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు ఆలయాలను సందర్శించి మొక్కులు తీర్చుకున్నారు.

- పవిత్ర పుణ్య క్షేత్రమైన పుష్పగిరిలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొండపైన గల శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి, శ్రీ సంతాన మల్లేశ్వర స్వాములకు అభిషేకాలను నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ ప్రాంతాల నుండి తరలి వచ్చిన భక్తులు పవిత్ర పెన్నా నదిలో స్నానాలు ఆచరించారు. అనంతరం శ్రీ చెన్న కేశవ స్వామి, సంతాన మల్లేశ్వర స్వామి వార్లను, లక్ష్మీదేవి అమ్మవారిని, గ్రామంలోని శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

అందరికీ మంచి జరగాలి: ఎమ్మెల్యే

జమ్మలమడుగు/ఎర్రగుంట్ల: నూతన సంవత్సరంలో కార్యకర్తలకు, ప్రజలకు మేలు జరగాలని, రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నూతన సంవత్సరం సందర్భంగా పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు భారీగా హాజరై శుభాకాంక్షలతోపాటు కేక్‌కట్ చేశారు. ఎర్రగుంట్ల మండల పరిధిలోని నిడుజివ్వి గ్రామంలోని ఎమ్మెల్యే డాక్టరు ఎం సుధీర్‌రెడ్డి నివాసం వద్ద పార్టీ నాయకులు కార్యకర్తలు పండ్లు, పూలతో వచ్చి నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. యర్రగుంట్లలోని పార్టీ కార్యాలయంలోనూ సంబరాలు జరిగాయి.



వల్లూరు: ప్రత్యేక అలంకరణలో చెన్న కేశవ స్వామి



వీఎన్‌పల్లె: వైయస్సార్‌సీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న మండల అధ్యక్షుడు రఘునాథ రెడ్డి



వేల్పుల: ఎంపీడీఓ కార్యాలయం వద్ద కేక్ కట్ చేస్తున్న మండల ఇన్‌ఛార్జి, ఎంపీపీ, జెడ్పీటీసీలు



వేల్పులలో కేక్ కట్ చేస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్, మండల పరిశీలకులు, తదితరులు



కమలాపురం పెద్ద దర్గాలో కేక్ కట్ చేస్తున్న పీఠాధిపతి కుటుంబ సభ్యులు



శ్రీ చెన్న కేశవ స్వామిని దర్శించుకోవడానికి క్యూలో వేచి వున్న భక్తులు



కమలాపురం: సీఎస్ఐ చర్చి ఆవరణలో పరుగు పందెంలో పాల్గొన్న మహిళలు



కమలాపురం: సీఎస్ఐ చర్చి ఆవరణలో స్కూటర్ రేస్‌లో పాల్గొన్న యువకులు



వేంపల్లె: జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



లింగాల.. నూతన సంవత్సర కేక్‌ను కట్ చేస్తున్న ఎంపీపీ రమాదేవి, మల్లికార్జునరెడ్డి



పులివెందుల: వైఎస్ మధురెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కచ్చితమైన తూకం ఇవ్వాలి

జమ్మలమడుగు: రేషన్ డీలర్‌లు వినియోగదారులకు కచ్చితమైన తూకంతో నిత్యావసర వస్తువులను పంపిణీ చేయాలని ఆర్డీఓ జి.శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం ఉదయం దిగువపట్నం కాలనీలోని రేషన్ షాపును ఆయన తనిఖీ చేశారు. అనంతరం వినియోగదారులతో నిత్యావసర వస్తువుల పంపిణీపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నిత్యావసర వస్తువులను డోర్ డెలివరీ చేయాలనే లక్ష్యంతో వాహనాల ద్వారా ఇంటింటికి సరఫరా చేస్తున్నామన్నారు. తూకం తక్కువ వస్తే ఫిర్యాదు చేయాలని వినియోగదారులకు సూచించారు. డీలర్‌లు ఇంటింటికి వెళ్లి నిత్యావసర వస్తువులను పంపిణీ చేయాలని సూచించారు. తహశీల్దార్ గురప్ప, డీటీ వేణుగోపాల్ పాల్గొన్నారు.



వినియోగదారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ

ఘనంగా అమీన్‌పీర్ సాహెబ్ గంధోత్సవం

కడప కల్చరల్ : కడప పెద్దదర్గాలో వెలిసిన హజరత్ దాదా అమీన్‌పీర్ సాహెబ్ ఉరుసు ఉత్సవాల్లో భాగంగా సోమవారం గంధోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ గంధ కలశాన్ని ఊరేగింపుగా తీసుకువచ్చి దర్గా గురువుల మజార్ వద్ద సమర్పించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు, ఫాతెహా చేసి ప్రసాదాన్ని భక్తులకు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉరుసు ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉరుసు, బుధవారం తహలీల్ ఫాతెహా నిర్వహించనున్నారు.



విద్యుద్దీప వెలుగులో పెద్ద దర్గా

వైభవంగా శ్రీవారి కల్యాణం

వేంపల్లె : స్థానిక పాపాఘ్ని నది ఒడ్డున ఎద్దుల కొండపై వెలసిన శ్రీవృషభాచలేశ్వరస్వామి ఆలయంలో శ్రీవెంకటేశ్వరస్వామి, గోదాదేవి కళ్యాణం వైభవంగా జరిగింది. సోమవారం ఆలయ అర్చకులు హరి ప్రవీణ్ ఆధ్వర్యంలో ఈ కళ్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. నంది మండలం గ్రామానికి చెందిన శివప్రసాద్‌రెడ్డి ఈ కళ్యాణానికి ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ ఈఓ శ్రీధర్, ఆలయ చైర్మన్ కుర్రాకుల వెంకటేష్, ఆలయ సిబ్బంది లక్ష్మిరెడ్డి, రంగప్రసాద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అక్షింతల ఊరేగింపు



అక్షింతలను ఊరేగిస్తున్న గ్రామస్తులు

పెండ్లిమర్రి: అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముని పూజ అక్షింతలు విశ్వ హిందు పరిషత్ వారి ఆధ్వర్యంలో సోమవారం నందిమండలం గ్రామానికి చేరాయి. నందిమండలం గ్రామ ప్రజలు గ్రామంలో బాణా సంచా, డప్పు వాయిద్యాల మధ్య ఊరేగింపు నిర్వహించి గ్రామంలో ప్రతి ఇంటికి శ్రీరాముని పూజ అక్షింతలు అందజేశారు. విశ్వహిందు పరిషత్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అక్షింతలు పంపిణీ

ఎర్రగుంట్ల : అయోధ్య రామమందిరం నిర్మాణం సందర్భంగా రామజన్మభూమి నుంచి వచ్చిన అక్షింతలను సోమవారం యర్రగుంట్ల పట్టణంలోని నడివూరులో ఇంటింటికి పంపిణీ చేశారు.

నూతన సంవత్సర క్యాలెండర్ల ఆవిష్కరణ

పులివెందుల : వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సోమవారం నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. కౌన్సిలర్ బొగ్గిటి పురుషోత్తం కుమారుడు డేనియల్ బాబు రూపొందించిన 2024లో మళ్లీ జగనే రావాలి క్యాలెండర్లను మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, సింహాద్రిపురం మండల నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సివిల్ సప్లయ్ డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డిలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాలెండర్‌ను చక్కగా రూపొందించారని.. ప్రభుత్వ పథకాలు ప్రతిబింబించేలా క్యాలెండర్‌ను రూపొందించారని అభినందించారు.



మళ్లీ జగనే రావాలి క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, తదితరులు

యాదవ సంఘ అభివృద్ధికి కృషి

పోరుమామిళ్ల: యాదవ సంఘం అభివృద్ధికి అందరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర నాట్యకళల డైరెక్టర్, మాజీ ఎంపీపీ ఈశ్వరమ్మ పేర్కొన్నారు. సోమవారం స్థానిక వేణుగోపాల స్వామి ఆలయంలో జరిగిన పోరుమామిళ్ల ప్రాంతీయ యాదవసంఘ సమావేశంలో ఆమె మాట్లాడారు. యాదవ సంఘం యాదవుల సమస్యల పట్ల అవగాహన కలిగి ఉండాలని, యాదవ విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. సమావేశంలో సంఘ నాయకులు మాట్లాడారు. అనంతరం నూతన కమిటీలను ఎన్నుకున్నారు. పోరుమామిళ్ల మండల యాదవ సంఘ గౌరవ అధ్యక్షులుగా క్రిష్ణమోహన్, వీరయ్య, అధ్యక్షులుగా మురళి, ప్రధాన కార్యదర్శిగా కిషోర్‌యాదవ్, కాశినాయన మండల అధ్యక్ష, కార్యదర్శులుగా నరసింహులు, తిరుపతి, కలసపాడు మండల అధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీనివాసులు, బాలుడు ను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో నాయకులు రమణయ్య, రామసుబ్బయ్య, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కొండాపురం: మండల పరిధిలోని ఓబన్నపేట పునరావాసకేంద్రం ఆంజనేయ స్వామి సమీపంలో పేకాటాడుతుండగా ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు ట్రైనీ డీఎస్పీ శ్రీకాంత్ ఎస్ఐ యోగేంద్ర సోమవారం తెలిపారు. సమాచారం మేరకు దాడి చేశామన్నారు. వారి వద్దనుంచి రూ 7650 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.